# లేడీస్ స్పెషల్

"రావయ్యా ! లేడీస్ స్పెషల్' అన్నాడు ఆదినారాయణ - నవ్వుతూ అతను డ్రైవరు.

''నడు బాబాయ్. నీకేదో పెళ్ళికి ప్రయాణంలా ఉంది'' అన్నాడు నారాయణ. అతను కండక్టరు.

నారాయణ ఎడం చేతిలో టికెట్ ట్రే బాక్స్ ఉంది. కుడి భుజాన క్యాష్‌బ్యాగ్ తేలిగ్గా వేలాడుతోంది.

డ్రైవరు ఆదినారాయణ, కండక్టర్ నారాయణ డ్యూటీ ఎక్కబోతూ సరదా కబుర్లతో పరాచికాలాడుకుంటూ బస్సు ఎక్కడం అలవాటే.

ఆదిలోనే ఆర్.టి.సి.లో చేరిన ఆదినారాయణ అన్నిటా అనుభవం కలవాడు. నారాయణ కంటే వయసులో పదేళ్ళు పెద్దవాడు.

''నడిపేవాడు ఆదినారాయణ - నడపబడేవాడు వట్టి నారాయణుడు- అంటూ తమాషా కబుర్లు చెప్పి నారాయణని అన్ని విషయాల్లోనూ మెళకువగా గైడ్ చేస్తుంటాడు.

స్టార్ట్ చెయ్యబోయి, రెండు మూడుసార్లు విఫల ప్రయత్నం చేసి బ్యానెట్ పైకెత్తి ''ఇదిగో నారాయణా ! దీనిమీద ట్రేతో ఓటిచ్చుకో'' అన్నాడు.

అంతే, బర్రుమని బస్సు కదిలింది. బస్సు ఖాళీగా ఉంది. బయట గాలి చల్లగా ఉంది. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. ఇంకా తెల్లారి అయిదు గంటలు కూడా కాలేదు. బద్ధకంగా వెలుగుతున్న ఎలక్ట్రికల్ దీపాలు తప్ప, ఉదయరేఖలింకా పరుచుకోనే లేదు.

హడావిడిగా రెండు బుట్టలతో బస్సు దగ్గరికి పరుగెట్టుకొచ్చిందో మహిళ. నిద్ర ముఖం, రేగిన జుట్టు, ముఖమేనా కడిగినట్టు లేదు. తెల్లారకముందే జీవన పోరాటం-

''కొంచెమాపయ్యా...'' అంటూ బస్సులోకెక్కి సీట్లో కూలబడింది. ఎనిమిది మడతలు పెట్టిన యాభై రూపాయల నోటు తీసి కండక్టరు కిచ్చి

''మారుకేటు'' అంది.

''తెల్లారకుండా ఏభైకి చిల్లర నేనెక్కడ తెచ్చేదమ్మా తల్లీ!''

''అలాగంటే ఎలా బాబూ ! నాకాడ పావలా తప్పిస్తే సిల్లి గవ్వలేదు'' అంది చూపిస్తూ.

''అయితే దిగు దిగు'' అంటూ బెల్ కొట్టాడు.

''అయ్యో - అదేంటయ్యా ! నాకాడ సిల్లరెట్టుకుని నీకియ్యలేదంటావా ఏంటీ?'' అంది.

''కండేటరు సిల్లరెట్టుకోవాల'' బింకంగా అంది మళ్లీ.

''నన్నేం చెయ్యమంటావు. నా దగ్గర యాభై చిల్లర ఉండదు. బస్సెక్కిన మొదటి దానవు నువ్వే - దిగు దిగు''

మళ్లీ అదేమాటంటే ఎలా ? కాసంత సూడు బాబు''

''ఇదెక్కడి గోల పొద్దున్నే'' నారాయణ టకటక కొట్టాడు. బస్సు స్లో అయింది, ఆగింది.

తట్టలమ్మ దిగలేదు గానీ, మరో రెండు తట్టలతో మరో అమ్మ ఎక్కింది.

లచ్చిమీ నువ్వటే - మంచిదైంది. రెండు మారుకెటు టిక్కెట్లు కొట్టించు - ఆనక నేనిచ్చుకుంటా'' -

లచ్చిమమ్మ అయిదు నోటిచ్చింది. నారాయణ ప్రాణం లేచొచ్చింది. ప్రారంభమే ప్రాణాంతకమైంది -

క్షణాల మీద ఆడ మగలతో బస్సు నిండిపోయింది. ఎనిమిది గంటలు దాటితే లేడీస్ స్పెషల్‌గా మారిపోయే ఆ బస్సు అప్పుడు మాత్రం అందర్నీ ఎక్కించుకు బరువుగా సాగుతోంది.

బస్సు కండక్టరంటే అందరూ చులకనగా చూస్తారు. చిల్లర డబ్బులు తీసేసు కోవడమే అతని పని అన్నట్లు భావిస్తారు. లక్షలు దొంగ వ్యాపారం చేసేవారు, వెధవ పనులు చేసి వేలు గడించేవారు కూడా కండక్టర్ని విమర్శించటానికి సిద్ధమైపోతారు.

''కండక్టరు గారూ, నాకు పావలా యివ్వాలండీ''

''ఇస్తామన్నా - ఇస్తాను. చిల్లర లేదు''

అలాగే అంటారు. నేను మర్చిపోయి దిగిపోతా.

''మరేం ఫర్లేదు. నేను గుర్తుపెట్టుకునిస్తాన్లే''

ఒక కంఠం రహస్యంగా ''పట్టిదే. వీళ్ళు చిల్లర డబ్బులు తినడంలో ఆరితేరారు. పట్టి కబుర్లే ఇవ్వడు చూడండి''

''ఇదిగోనమ్మా నీ పావలా''

అంతే ఆ రహస్య కంఠం తన ముఖాన్ని కిటికీలో దూర్చింది.

''అదృష్టమే, నీ డబ్బులు నీకొచ్చాయి''

''ఏవమ్మా! అతను చిల్లర తిరిగివ్వలేదని అంత బాధ పడకపోతే ఎంత టిక్కెట్టో అంతే యిస్తే సరి'' అందొక మహిళ.

''మా దగ్గర చిల్లరుండద్దూ''

''మీ కొక్కరికి కావలసిందే మీరు పెట్టుకోలేక పోతే ఆయన కూడా అందరికీ ఇవ్వగలడా?''

బస్సు రద్దీగా ఉంది. బయట ఎండగా ఉంది. లోపల ఉక్కగా ఉంది.

''ఇదిగో సుజీ ! ఈ రోజెలాగైనా టికెట్ సంపాదించాలా'' అని గొంతు బాగా తగ్గించి ''బ్లాకులోనైనా సరే''

''అమ్మో ! చాలా ఉంటుందేమో!!

''ఫర్లేదులే – ముప్ఫయి రూపాయలైనా నేను సిద్ధమే. నా ఫేవరేట్ హీరో సినిమా ఫస్టుడే చూడాల్సిందే. అవునూ కండక్టరు నీకు అర్ధరూపాయివ్వాలి కదూ... అడుగు... అడుగు'' –

★ ★ ★ ★

బిలబిలమని కాలేజీ ఆడపిల్లలందరూ తోసుకుంటూ నవ్వుకుంటూ బస్సెక్కారు. రకరకాల పూలన్నీ పూసిన కొమ్మలు కదిలినట్లు కలకల్లాడింది బస్సు.

''సార్, ఇది లేడీస్ స్పెషల్ అయ్యా – లేడీస్ స్పెషల్. కండక్టరు నారాయణ అరుస్తూనే ఉన్నాడు. డ్రైవరు ఆదినారాయణ కూడా ఒక్కోమాట అందుకుంటున్నాడు. అయినా ఎక్కేవాళ్లు ఎక్కి, కండక్టరు వైపు కాస్సేపు అయోమయంగా చూసి దిగుతున్నారు.

బస్సు మధ్యనంతా ఖాళీగా ఉంది. డ్రైవరు దగ్గర మాత్రం యిరుకుగ్గా, రద్దీగా ఉంది. కొందరాడపిల్లలు విలాసంగా ఫుట్‌బోర్డు మీదే ఉండిపోయారు.

లోపలికెళ్ళండమ్మా తల్లీ – ఒక్కడుగు లోపలకెయ్యండమ్మా అమ్మలూ లోపలికెళ్ళు పాపా లోపలికి నడు –'' అంటూ ఆదినారాయణ బతిమాలుతూనే ఉన్నాడు.

ఒక్కరంటే ఒక్కరు కదిలితే ఒట్టు. వెనుక నుంచి దిగి ముందుకొచ్చిన కండక్టరు.

''ఫుట్ బోర్డుమీద ఎవ్వరూ ఉండేందుకు లేదు. లోపలికి సర్దుకోండి. లేపోతే దిగిపోండి'' అన్నాడు విసుగ్గా.

''దిగిపోతే మేము యిళ్ళకు చేరేదెలా?'' అమాయక ప్రశ్న.

''చేరాలంటే బుద్ధిగా అందర్నీ లోపలికి సర్దుకోమని చెప్పండి''

''మాకేం, మేం చెప్పం, అది కండక్టరు పని'' ఘరానా దబాయింపు.

''చెప్తున్నా వినకుంటే నేనేం చేసేది?''

''అందుకు మేమేం చేసేది'' మరో అమ్మాయి రెట్టించింది.

ఇంతలో కెవ్వు కెవ్వు మంటూ అరుపులు, హడావిడి, ఫుట్ బోర్డు మీదున్నందరూ జిరజిరా కిందికి దిగిపోయారు, ఏం జరిగిందో అర్థంకాని కొందరు లోపలుండి పోయారు.

అమ్మా! ఇది లేడీస్ స్పెషల్. మీరు వెనకాలొచ్చే జనరల్ బండిలో ఫుట్ బోర్డు మీద నిలబడి రండి'' అంటూ బండి లాగించాడు.

కిందనున్న అమ్మాయిలు ఆకాశంలో కెగిరిన పక్షుల్లా కేరింతలు కొట్టి బస్సాప మన్నారు.

అందరూ పి.టి. ఉషలై వచ్చి బస్సులోపలకెళ్ళి సర్దుకు పోయారు. ఇంతకీ ఏం జరిగిందలా దిగిపోయారు ?

కొందరు డ్రైవరుతో పోట్లాటకి దిగారు.

ఏంటయ్యా! మమ్మల్ని కిందవదిలేసి వెళ్ళిపోదామనా ?'' ఏంటీ మీ ప్లాను. ఈ బస్సు మాకోసమే వేశారు తెలుసా ''

''లోపలికేమొచ్చిందీ – ఏం పెట్టారు''

''గొంగళీ పురుగు''

''బస్సులోపలికెలా వచ్చింది. మమ్మల్ని దింపేయడానికి పెట్టారా ?'' అందొక అమ్మాయి డిటెక్టివ్ ఫోజు పెట్టి.

ఆదినారాయణ గొంతు సవరించుకున్నాడు, బస్సు స్టడీగా పోతోంది.

''మీరంతా చక్కగా చదువుకుంటున్నారు - కొందరు ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. మీరు బ్రతుకులో బాగా పైకెడతారు, డాక్టర్లవుతారు, ఇంజనీర్లవుతారు, లెక్చరర్లవుతారు, రాజకీయ నాయకురాళ్ళవుతారు, మరి కాస్తంత క్రమశిక్షణ తెలుసుకోక పోతే ఎలాగమ్మా, ఇంత చదువుకుని గొంగళీ పురుగుల్లా అక్కడే ఉండి పోతే ఎలా? సీతాకోక చిలుకలై ఎగరద్దూ'' ఆదినారాయణ చుర్రకలెయ్యడం మొదలు పెట్టాడు.

నారాయణ సీరియస్‌గా ముఖం పెట్టి

''ఒక సిటీ బస్సు కండక్టరు రోజుకి సుమారు ఎనిమిది వందల మంది ప్రయాణీకుల్తో మాట్లాడాల్సి ఉంటుందని స్టాటిస్టిక్సులో తేలిందని డి. ఎమ్. గారన్నారు. కానీ ఒక స్త్రీల ప్రత్యేక బస్సయితే రోజుకి పదహారు వేల మందితో మాట్లాడిల్సి వస్తుందేమో'' అన్నాడు -

అందరూబస్సు అదిరిపోయేలా నవ్వారు. ఆదినారాయణ ఉషారుగా కాస్తంత స్పీడు పెంచాడు.

ఉదయం పది గంటలు దాటంగానే రింగ్ రోడ్డు దగ్గర తొండముదిరి ఊసరవిల్లయినట్లు లేడీస్ స్పెషల్ మామూలు బస్సయింది.

ఆంధ్రభూమి
డైలీ -